కాన్‌కుర్తిలో చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

## కార్యకర్తలకు అండగా ఉంటాం

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి

నారాయణపేట, జూన్ 24 : పార్టీ కోసం పనిచేసే ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని నారాయణపేట బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఎస్.రాజేందర్‌రెడ్డి అన్నారు. దామరగిద్ద మండలం ముస్తాపేట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త రఘుగౌడ్, మరికల్ మండలం పెద్దచింతకుంటకు చెందిన కార్యకర్త హన్మంతు ప్రమాదవశాత్తు మరణించారు. వీరిద్దరికీ పార్టీ తరపున మంజూరైన రూ.2లక్షల బీమా చెక్కులను సోమవారం సింగారం చౌరస్తా వద్ద ఉన్న బీఆర్ఎస్ కార్యాలయంలో, దామరగిద్ద మండలం కాన్‌కుర్తిలో కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మండల ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మెడికల్ కాలేజీకి ఎన్ఎంసీ సుముఖత

- జిల్లా దవాఖాన, కళాశాల భవనాన్ని పరిశీలించిన కమిటీ సభ్యులు
- వసతుల కల్పన, ఎక్విప్‌మెంట్‌పై సంతృప్తి

గద్వాలటౌన్, జూన్ 24 : గద్వాలకు మెడికల్ కళాశాలకు గ్రీన్ సిగ్నల్ వచ్చినట్లే అంటే అవుననే చెప్పాలి. ఎందుకంటే సోమవారం గద్వాలకు వచ్చిన ఎన్ఎంసీ కమిటీ సంతృప్తి వ్యక్తం చేయడం ఇందుకు కారణం. జిల్లా కేంద్రంలోని సంగాల చెరువు వద్ద నూతనంగా నిర్మాణమవుతున్న మెడికల్ కళాశాల, జిల్లా దవాఖానను ఎన్ఎంసీ కమిటీ సభ్యులు డాక్టర్ నావిద్ నసీర్ షాహ, డాక్టర్ నాగభూషణం, డాక్టర్ దేవ్ డైవాంగ్ నట్వర్ లాల్ తనిఖీ చేశారు. ముందుగా నూతన భవనానికి చేరుకొని అక్కడి నిర్మాణాన్ని, వసతుల కల్పన, వార్డుల ఏర్పాటు తదితర వాటిని పరిశీలించారు. అలాగే అర్బన్ హెల్త్ సెంటర్లను పరిశీలించారు. అనంతరం జిల్లా దవాఖానకు చేరుకొని రికార్డులను పరిశీలించారు. టీచింగ్ స్టాఫ్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. పని చేసే వారి విద్యార్హతలు, అనుభవం తదితర వివరాలను తనిఖీ చేశారు. కళాశాలకు కావాల్సిన పరికరాలు, మందులు, ఏఏ వ్యాధులకు సంబంధించినవి వచ్చాయా లేదా అని వాకబు చేశారు. మొత్తం మీద మెడికల్ కళాశాల అనుమతికి కమిటీ సుముఖత వ్యక్తం చేసినట్లేనన్న అభిప్రాయాన్ని డాక్టర్లు వ్యక్తం చేశారు. కాగా టీచింగ్ స్టాఫ్ నియామకాలు సరిగ్గా లేకపోవడంపై కమిటీ అసంతృప్తిని వ్యక్తం చేసినట్లు తెలిసింది. వారితో పాటు దవాఖాన ఇన్‌చార్జి సూపరింటెండెంట్ నవీన్‌క్రాంతి, కళాశాల ప్రిన్సిపాల్ పార్వతి, డాక్టర్లు కిశోర్‌కుమార్, నృశాలి తదితరులు ఉన్నారు.

## విద్యార్థిని అభినందించిన కలెక్టర్

అచ్చంపేట టౌన్, జూన్ 24 : అచ్చంపేట పట్టణంలోని జెడ్పీ ప్రభుత్వ బాలుర పాఠశాలలో చదువుతున్న అంజలి అద్భుతమైన ప్రతిభతో జాతీయ స్థాయికి ఎంపికైంది. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సోమవారం అంజలిని కలెక్టర్ వద్దకు తీసుకెళ్లి ఆమె నైపుణ్యాన్ని వివరించారు. దీంతో కలెక్టర్ ఆ విద్యార్థినిని, గైడ్ టీచర్‌ను అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అంజలి తన గైడ్ టీచర్ ఆఫ్రీన్ బేగం సహకారంతో పేషెంట్, దివ్యాంగులు ఇబ్బందులు పడకుండా తీసుకెళ్లే సౌకర్యవంతమైన వీల్ చైర్‌ను రూపొందించడం అద్భుతమన్నారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ ఈనెల 14,15వ తేదీల్లో ఇన్‌స్పైర్ మనక్ అనే కార్యక్రమంలో రాష్ట్రస్థాయికి ఎంపిక అయ్యిందని, 130 ఎగ్జిబిట్‌లో తమ విద్యార్థిని కూడా ఉందని తెలిపారు. అనంతరం ఆన్‌లైన్ పద్ధతిలో విజేతగా నిలవడంతో జాతీయ స్థాయికి ఎంపికై మన జిల్లాకే మంచి పేరు తీసుకొచ్చిందన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

అంజలి తయారు చేసిన వీల్ చైర్

# పట్టా భూమిలో ఇసుక తవ్వకం

- 5.17 ఎకరాలకు గత ప్రభుత్వం పోడు పట్టా అందజేత
- గిరిజనుడి భూమిలో ఇసుక అక్రమంగా తవ్వకాలు
- తోడివేతతో చెరువును తలపిస్తున్న పంట పొలం
- అధికారులకు విన్నవించినా స్పందన కరువు

సాగు భూమిలోంచి ఇసుక తరలించగా ఏర్పడిన గుంతలో నిలిచిన నీరు

మహబూబ్‌నగర్, జూన్ 24 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : 'కుక్కపిల్లా..అగ్గిపుల్లా..సబ్బు బిళ్లా.. కాదేదీ కవితకనర్హం'.. అని శ్రీశ్రీ అన్నట్లు నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గంలో చేను, చెలక, చెరువు, గుంట, వాగులు, వంకలు, పంటలు కావేవి ఇసుక మాఫియాకు అనర్హమని అధికార పార్టీ నాయకులు నిరూపిస్తున్నారు. ఈ సిగ్మెంట్‌లో రోజురోజుకూ ఇసుక మాఫియా ఆగడాలు పేట్రేగిపోతున్నాయి. పెద్దవాగును చిన్నబోయే విధంగా చేసిన కొందరు మాఫియా పొలాల్లో అక్రమంగా ఇసుక డంప్‌లను పెట్టినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో నేడు పంట పొలాలను సైతం ఇసుక కోసం మయం చేస్తున్నారు. రైతులకు తెలియకుండా రైతుల పంట పొలాలను ఇసుక కోసం కొల్లగొడుతున్నారు. గేమ్యానాయక్ తండాకు చెందిన దశరథం నాయక్‌కు జిల్దార్ చెరువు సమీపంలో గత ప్రభుత్వం 5.17 ఎకరాల సాగు భూమికి సంబంధించి అసెంబ్లీ ఎన్నికలకు ముందు పోడు పట్టా ఇచ్చింది. తర్వాత భూమిలో ఒక్కసారి మొక్కజొన్న పంట వేశాడు. వానకాలం సీజన్ రావడంతో మళ్లీ విత్తనాలు వేసేందుకు సిద్ధమయ్యాడు. కానీ రైతు కళ్లల్లో ఆనందం ఎక్కువ రోజులు నిలవలేదు. ప్రభుత్వం మారడంతో సాగు భూమి కాస్త చెరువు కుంటగా మారింది. పదును వాన పడితే మొక్కజొన్నలు వేసి పంట సాగు చేసుకోవాలని ఎంతో ఆశతో ఎదురు చూశాడు. ప్రస్తుత ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించడంలో ఆలస్యమైనా అరువు తెచ్చుకొని మక్క విత్తనాలను కొనుగోలు చేశాడు. ఈనెల 11న విత్తనాలను వేసేందుకు తన పొలం వద్దకు వెళ్లగా కనిపించకపోవడంతో రైతు దశరథం అవాక్కయ్యాడు. తన సాగు భూమి స్థానంలో చెరువు వచ్చింది. తన పొలంలోకి అధికార పార్టీ నాయకులు 10వ తేదీ సాయంత్రం అక్రమంగా ప్రవేశించి జేసీబీలతో ఇసుకను తీసినట్లు గుర్తించాడు. 12వ తేదీన పోలీస్ స్టేషన్, తాసీల్దార్ కార్యాలయల్లో ఫిర్యాదు చేశాడు. అధికారుల నుంచి మాత్రం బాధిత రైతుకు చూద్దాం, చేద్దామనే సమాధానం వచ్చింది. దీంతో రైతు ఇసుక మాఫియా వద్దకు వెళ్లి కనీసం తీసిన గుంతలను మట్టితో పూడ్చితే తాను పంటలు సాగు చేస్తానని ప్రాధేయపడ్డాడు. దీనికి మాఫియా బెదిరింపులకు పాల్పడింది. అక్కడ తవ్విన గోతుల్లోనే పాతిపెట్టి ఇసుక కప్పుతామని బెదిరించారని సదరు రైతు వాపోయాడు. దింతో దిక్కు తోచక సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు చేశాడు. రైతుల పట్టా భూమిలోకి వచ్చి అక్రమంగా ఇసుక తీస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారని భూమి పుత్రుడు కన్నీటి పర్యంతమయ్యాడు. భూమిలో పంటలు సాగు చేసుకొని కుటుంబాన్ని పోషించుకుందాం అనుకుంటే ఇసుక కోసం గుంతలు తీసి మా జీవితాలను గోతులోకి నెట్టారని ఆవేదన వ్యక్తం చేశాడు. సంబంధిత అధికారులు న్యాయం చేయాలని బాధిత రైతు ప్రాధేయపడుతున్నాడు.

### ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

పాలమూరు, జూన్24: రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదలయ్యాయి. ఈ సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు జనరల్ 5,933 మందికి 3,600మంది ఉత్తీర్ణత సాధించగా, ఒకేషనల్‌లో 670మంది విద్యార్థులకు 341 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరం జనరల్ విద్యార్థులు 3,277మంది విద్యార్థులకు 1,435 మంది, ఒకేషనల్‌లో 498మంది విద్యార్థులకు 215 మంది ఉత్తీర్ణత సాధించారని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి తెలిపారు.

### ఆర్డీవో విచారణ

బాలానగర్, జూన్ 24: స్థానిక తాసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఆర్డీవో నవీన్ కుమార్ విచారణ చేశారు. ఆదివారం ఆర్ఐ వెంకట్‌రెడ్డి మరో విశ్రాంత ఉద్యోగి గిరప్పతో కలిసి రెవెన్యూ దస్త్రాల పనులు నిర్వహిస్తుండటంపై ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అధికారులను నిలదీశారు. ఈ విషయమై ఆర్డీవో అధికారులతో విచారణ చేశారు.

## తుపత్రాలలో ఇరువర్గాల మధ్య ఘర్షణ

అయిజ, జూన్ 24 : జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మున్సిపాలిటీ పరిధిలోని తుపత్రాల గ్రామంలో ఇరువర్గాలు ఘర్షణ పడగా.. భయానక వాతావరణం నెలకొన్నది. కర్రలు, రాళ్లతో ఇండ్లపై దాడులు చేయగా వాహనాలు, వస్తువులు ధ్వంసమయ్యాయి. గ్రామస్తుల కథనం మేరకు.. గత నెల 29వ తేదీ రాత్రి కుమ్మరి ఉరుకుందు, మహేశ్‌గౌడ్ మధ్య మాటా మాటా పెరగగా.. మహేశ్‌గౌడ్‌ను ఉరుకుందు చెప్పుతో కొట్టాడు. అది కాస్త అలజడికి కారణమై ఇరువర్గాలు దాడులు చేసుకున్నారు. అప్పట్లో పోలీసులు ఇరువర్గాలపై కేసు నమోదుచేశారు. కాగా, ఆదివారం రాత్రి ఈలలు, కేరింతలు కొడుతూ అవతలి వర్గం వారిని రెచ్చగొట్టేలా మాట్లాడుతూ గొడవ సృష్టించారు. దీంతో మహేశ్‌గౌడ్ వర్గీయులు కొందరు కర్రలు పట్టుకొని హల్‌చల్ చేశారు. కుమ్మరి ఉరుకుందు ఇంటిపై దాడి చేసి వస్తువులు, వాహనాలు ధ్వంసం చేశారని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. గ్రామంలో ఎస్సై విజయ్ భాస్కర్ నేతృత్వంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. సోమవారం సీఐ రత్నం, ఎస్సై ఇరువర్గాలను స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం దాడులకు గురైన ఇండ్లను పరిశీలించి వివరాలను తెలుసుకున్నారు.

### అన్నదమ్ములపై కేసు నమోదు

ఉండవెల్లి, జూన్ 24: అన్న, తమ్ముడు పొలం గెట్టు పంచాయతీలో ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడంతో ఇద్దరిపై కేసు నమోదు చేసిన ఘటన సోమవారం చోటుచేసుకున్నది. ఎస్సై శ్రీనివాస్ కథనం ప్రకారం.. మండలంలోని కంచుపాడుకు చెందిన వెంకటేశ్వరరెడ్డి, ఆంజనేయరెడ్డి అన్నదమ్ముళ్లు. ఒక్కొక్కరికి 4ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నది. గెట్టు పంచాయతీలో పెద్దలసమక్షంలో ఒకరిపై ఒకరు రాయి, కర్రలతో దాడి చేసుకోవడంతో రక్త గాయాలయ్యాయి. ఇద్దరు వేర్వేరుగా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

### ప్రైవేట్ పాఠశాల గది సీజ్

అయిజ, జూన్ 24: పట్టణంలోని జీవీఆర్‌ఎం పాఠశాలలో పాఠ్యపుస్తకాలు విక్రయిస్తుండడంతో పుస్తకాలు ఉన్న గదిని సీజ్ చేసినట్లు ఎంఈవో నర్సింహులు తెలిపారు. సోమవారం పాఠశాలను సందర్శించిన సీఆర్పీకి పాఠ్యపుస్తకాలు నిల్వ ఉండడంతో సీజ్ చేయమని ఆదేశించినట్లు ఆయన పేర్కొన్నారు. పాఠశాల ప్రాంగణంలో పుస్తకాలు, నోట్‌బుక్స్ విక్రయిస్తే చర్యలు తప్పవని ఎంఈవో హెచ్చరించారు.

### దాడి ఘటనలో 11 మందికి రిమాండ్

నారాయణపేటరూరల్, జూన్ 24: నారాయణపేట మండలంలోని కోటకొండలో ఏరువాక పౌర్ణమి రోజు ఘర్షణకు పాల్పడిన 11 మందిని రిమాండ్‌కు తరలించినట్లు నారాయణపేట డీఎస్పీ నల్లపు లింగయ్య తెలిపారు. ఏరువాక తాడు తెంపే క్రమంలో చంద్రప్పపై రాహుల్, రాజు, శ్రీహరి, మురళి, నర్సింహ, అంజి, మరో ఏడుగురు దాడికి పాల్పడడంతో వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి సోమవారం రాత్రి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. ఈఘటనలో బాధ్యులైన వారిని శిక్షించాలని దళిత సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రాస్తారోకో చేయగా ఎస్పీ హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

### ముఖంపై నీళ్లు చల్లి నగలు చోరీ

కేటీదొడ్డి, జూన్ 24 : గుర్తు తెలియని వ్యక్తులు ఓ మహిళ ముఖంపై నీళ్లు చల్లి నగలు ఎత్తుకెళ్లిన ఘటన సోమవారం మండలంలోని కుచినేర్ల గ్రామంలో చోటు చేసుకున్నది. బాధితురాలి కథనం ప్రకారం.. కుచినేర్లకు చెందిన ఓ మహిళ సోమవారం తెల్లవారుజామున ఇంటి ముందు పని చేస్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి తాగడానికి నీళ్లు ఇవ్వాలని కోరారు. దీంతో ఆమె ఇంట్లోకి వెళ్లి నీళ్లు తెచ్చి ఇచ్చింది. వారు ఆమె ముఖంపై నీళ్లు గట్టిగా చల్లడంతో స్పృహ కోల్పోయింది. ఇంతలో వారు ఆమె మెడలోని మూడు తులాల బంగారు ఆభరణాలతో ఉడాయించారు. కొద్దిసేపటికి ఆమె తేరుకుని, కేటీదొడ్డి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేశామని ఎస్సై శ్రీనివాస్‌రావు తెలిపారు.

### ప్లాస్టిక్ నిషేధాన్ని పాటించాలి

అమ్రాబాద్, జూన్ 24: అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలో అందరూ ప్లాస్టిక్ నిషేధాన్ని పాటించాలని మన్ననూర్ అటవీ క్షేత్రాధికారి ఈశ్వర్ సోమవారం ప్రకటనలో తెలిపారు. అడవిలో వాహనాల వేగం 30కి.మీలు గంటకు పాటించాలని అధిక వేగంతో వన్యప్రాణులకు ప్రమాదం జరిగే అవకాశం ఉందన్నారు. అదేవిధంగా ఏటీఆర్‌లో ప్రయాణించే ప్రయాణికులు ఒకసారి వినియోగించే ప్లాస్టిక్ వస్తువులను అడవిలోకి తీసుకురాకూడదని, అలాగే వన్యప్రాణులకు ఎలాంటి ఆహారాన్ని రోడ్లపై వేయరాదని సూచించారు. నియమాలను పాటించని వారిపై అటవీ చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### వేతనాలు పెంచాలని కార్మికుల ధర్నా

కలెక్టరేట్ ఎదుట ధర్నాచేస్తున్న పంచాయతీ కార్మికులు

మహబూబ్‌నగర్, జూన్ 24 : తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్‌కు నెలల తరబడి జీతాలు ఇవ్వకపోవడం దారుణమని సీఐటీయూ సీనియర్ నాయకుడు కిల్లెగోపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి కురుమూర్తి అన్నారు. సోమవారం మహబూబ్‌నగర్ కలెక్టరేట్ ఎదుట గ్రామ పంచాయతీ కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నాచేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గ్రాంట్స్ లేవన్న సాకుతో జీతాలు ఇవ్వకపోతే వారి కుటుంబాలు ఎలా గడవాలని ప్రశ్నించారు. అనంతరం డీపీవో విజయేంద్రనాథ్, డీఎల్‌పీవో పండరినాథ్ ధర్నా వద్దకు చేరుకొని సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో పంచాయితీ కార్మికులు కలెక్టర్ విజయేంద్రకు వినతిపత్రం అందజేసి ధర్నా విరమించారు. కార్యక్రమంలో కార్మికులు గాలెన్న, సత్యన్న, తిరుమలయ్య, రాజ్‌కుమార్, ఆంజనేయులు, కృష్ణయ్య పాల్గొన్నారు.

### దవాఖాన ఎదుట కార్మికుల ధర్నా

నాగర్‌కర్నూల్, జూన్ 24 : వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా దవాఖాన ఎదుట కార్మికులు ప్రధాన గేటు వద్ద బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాత టెండర్లను రద్దు చేసి కొత్త టెండర్ వేసి కార్మికుల సంఖ్యను పెంచాలన్నారు. కార్మికులు తక్కువగా ఉండడంతో పనిభారం పెరిగిందన్నారు. పాత టెండర్లను రద్దు చేసి కొత్తగా టెండర్లు వేసి వేతనాలు సరిగా అందించాలన్నారు. 30మందితోనే అన్ని పనులు చేయిస్తున్నారని, ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి, ఎంపీ మల్లురవి, కలెక్టర్ స్పందించాలని కోరారు. తమ సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళన కొనసాగిస్తామన్నారు.

## గత ప్రభుత్వ విధానాలే..

- వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ఎంఎస్ఎంఈ పాలసీ
- రాష్ట్ర ఐటీ మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, జూన్ 24(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన విధానాలను యథావిధిగా కొనసాగిస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో 'ఎంఎస్ఎంఈ-సమ్మిళిత అభివృద్ధి' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో శ్రీధర్‌బాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...'ప్రభుత్వాలు వస్తుంటాయ్.. పోతుంటాయ్, కానీ అభివృద్ధి ఆగకూడదు.. పారిశ్రామికాభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఇందులో భాగంగా గత సర్కారు ప్రవేశపెట్టిన వివిధ పాలసీలను కొనసాగిస్తాం'అని పేర్కొన్నారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ఎంఎస్ఎంఈ పాలసీని ప్రవేశపెట్టనున్నట్లు, దీంతో దేశంలోనే మొదటి ఎంఎస్ఎంఈ పాలసీ తెచ్చిన రాష్ట్రంగా తెలంగాణ నిలువనున్నదన్నారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టనున్న కొత్త ఎంఎస్ఎంఈ పాలసీ రూపకల్పన జరుగుతున్నదని, దీనిపై సూచనలు, సలహాలు ఇవ్వాలని పరిశ్రమ వర్గాలను కోరారు. పరిశ్రమకు నైపుణ్యంగల ఉద్యోగుల అవసరం ఎంతో ఉందని, ఇందుకు అనుగుణంగా నైపుణ్యాలను అభివృద్ధి చేసేందుకు త్వరలోనే ఐఎస్‌బీ తరహాలో స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

## మూడు నెలల్లో నైనీలో బొగ్గు ఉత్పత్తి

- సింగరేణి సీఎండీ ఎన్ బలరాం వెల్లడి

హైదరాబాద్, జూన్ 24 (నమస్తే తెలంగాణ) : అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న ఒడిశాలోని నైనీ కోల్ బ్లాక్ నుంచి ఈ సెప్టెంబర్ చివరికల్లా బొగ్గు ఉత్పత్తిని ప్రారంభించాలని సింగరేణి సంస్థ లక్ష్యంగా పెట్టుకున్నది. నైనీకి 50 కిలోమీటర్ల దూరంలోనే 1,600 మెగావాట్ల థర్మల్ విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాన్ని కూడా సంస్థ నిర్మించనున్నది. ఈ థర్మల్ ప్లాంట్ నిర్మాణానికి అనువైన స్థలంతోపాటు కీలకమైన భూసేకరణ సమస్యను పరిష్కరించేందుకు సింగరేణి సంస్థ సీఎండీ ఎన్ బలరాం సోమవారం ఒడిశాలో పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ కుమార్‌జెనాతో ప్రత్యేకంగా భేటి అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నైనీ కోల్‌బ్లాక్‌కు ఇప్పటికే అన్ని అనుమతులు లభించాయని, రెండో దశ అటవీ అనుమతుల కోసం నిబంధనలను పాటిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కోరినట్లుగానే రూ.180 కోట్లు చెల్లించామని, వన్యప్రాణి నిర్వహణ ప్రణాళికలో భాగంగా మరో రూ. 39 కోట్లు డిపాజిట్ చేశామన్నారు. ప్రాజెక్ట్ ప్రారంభం కోసం 783 హెక్టార్ల అటవీభూమిని తమకు బదలాయించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. నైనీ బొగ్గు గని నుంచి ఉత్పత్తికి అన్ని రకాలుగా సహకరిస్తామని ఒడిశా సీఎస్ హామీనిచ్చారు.

## 4,800 కోట్ల నుంచి సున్నాకు

### బైజూస్‌లో పెట్టుబడులను రైటాఫ్ చేసిన ప్రోసస్




న్యూఢిల్లీ, జూన్ 24: డచ్‌కి చెందిన పెట్టుబడుల సంస్థ ప్రోసస్ నిండా మునిగింది. బైజూస్‌లో పెట్టిన 578 మిలియన్ డాలర్ల(రూ.4,800 కోట్ల) పెట్టుబడులను రైటాఫ్ చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ ఎడ్యుటెక్ సంస్థ బైజూస్‌లో గతంలో 9.6 శాతం వాటా కలిగివున్నది. ప్రస్తుతం ఈ వాటాను సాంకేతికంగా రద్దు చేసుకుంటున్నట్లు తెలిపింది. దీంతో సంస్థకు రూ.4,800 కోట్ల భారీ నష్టం వాటిల్లింది. ఈ విషయాన్ని నెదర్లాండ్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు సమాచారం అందించింది. బైజూస్‌లో ఈక్విటీ ఇన్వెస్టర్ల వాటాల విలువ భారీగా క్షీణించిన నేపథ్యంలో రైటాఫ్ నిర్ణయం తీసుకున్నామని ప్రోసస్ వెల్లడించింది. దీంతో 2024 ఆర్థిక సంవత్సరంలో సంస్థ 493 మిలియన్ డాలర్ల నష్టం వాటిల్లింది. రైట్స్ ఇష్యూకి ముందు బైజూస్‌లో 9.6 శాతం వాటా ఉందని పేర్కొంది. కంపెనీ ఆర్థిక పరిస్థితులు, అప్పులు, భవిష్యత్తు అంచనాలకు తమవద్ద ఎలాంటి సమాచారం లేకపోవడంతో బైజూస్ కంపెనీ విలువను సున్నాకు తగ్గిస్తున్నట్లు ప్రోసస్ ప్రతినిధి ఒకరు తెలిపారు.

వాణిజ్య

# కిర్రాక్ ఐపీవో షో

జనవరి మొదలు పబ్లిక్ ఇష్యూకు 37 సంస్థలు • 32,000 కోట్ల సమీకరణ • 17 ఏండ్లలో ఇదే అత్యుత్తమ రికార్డు

ముంబై, జూన్ 24: ఈ ఏడాది సెకండరీ మార్కెటే కాదు.. ప్రైమరీ మార్కెట్ కూడా దుమ్మురేపింది. బీఎస్ఈ ప్రధాన సూచీ సెన్సెక్స్, ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీలు సరికొత్త స్థాయిల్లో కదలాడుతున్నాయి. మరోవైపు స్టాక్ మార్కెట్లలోకి రికార్డు స్థాయిలో ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్లు (ఐపీవో) వచ్చేస్తున్నాయి. ఎంతలా అంటే గడిచిన 17 ఏండ్లలో ఇదే అత్యుత్తమ ప్రథమార్ధం (జనవరి-జూన్)గా నిలిచింది. ఈ ఏడాది జనవరి మొదలు ఇప్పటిదాకా 37 సంస్థలు పబ్లిక్ ఇష్యూకు వచ్చాయి. ఇందులో కో-వర్కింగ్ స్పేస్, ఫర్నీచర్ రిటైలింగ్, ఆన్‌లైన్ టికెట్ బుకింగ్ వంటి కంపెనీలూ ఉండటం విశేషం. ఇవన్నీ కలిసి దాదాపు రూ.32,000 కోట్ల నిధులను సమీకరించడం గమనార్హం. ఈ వారంలోనే మూడు ఐపీవోలు ముగిశాయి.

**2007 తర్వాత..**

2007 ప్రథమార్ధంలో గరిష్ఠంగా 54 సంస్థలు దేశీయ స్టాక్ మార్కెట్లలోకి ఐపీవోల ద్వారా ప్రవేశించాయి. నాడు అవి సమీకరించిన నిధులు రూ.20,833 కోట్లు. మళ్లీ ఆ తర్వాత ఇప్పుడే ఆ స్థాయిలో కంపెనీలు ఈక్విటీ మార్కెట్లలోకి వచ్చాయి. అయితే 2022 జనవరి-జూన్‌లో 16 సంస్థలే వచ్చినా రూ.40,311 కోట్ల నిధుల సమీకరణ జరిగింది. ప్రభుత్వ జీవిత బీమా దిగ్గజం ఎల్ఐసీ ఐపీవో కలిసొచ్చింది. ఈ ఒక్క పబ్లిక్ ఇష్యూ విలువే రూ.21,000 కోట్లు. ఇది గనుక లేకపోతే ఐపీవో మార్కెట్‌లో 6 నెలల్లో సమీకరించిన నిధులపరంగా ఈ ఏడాదే అత్యుత్తమం. ఇక గత ఏడాది ప్రథమార్ధంతో పోల్చితే ఈ ఏడాది ఫండింగ్ నాలుగు రెట్లు ఎగిసింది. దేశ, విదేశీ మదుపరుల మద్దతే ఇందుకు కారణం. స్టాక్ మార్కెట్ల రికార్డు లాభాలూ కారణమే. ఈ లాభాలకు ఆకర్షితులయ్యే మరిన్ని సంస్థలు ఐపీవోలకు సిద్ధమైనట్టు మార్కెట్ నిపుణులు తాజా ట్రెండ్‌ను విశ్లేషిస్తున్నారు. పైగా గతంలో పార్లమెంట్ ఎన్నికలు జరిగిన ఏ ఏడాది ప్రథమార్ధంలోనూ ఈసారి నమోదైన దాంట్లో నాల్గో వంతు కూడా పబ్లిక్ ఇష్యూలు, నిధుల సమీకరణ జరుగలేదు.

**క్యూలో మరికొన్ని..**

హ్యుందాయ్ ఇండియా, స్విగ్గీ, ఓలా తదితర ప్రముఖ సంస్థలన్నీ ఐపీవోలకు క్యూ కట్టాయి. ఇందులో హ్యుందాయ్ పబ్లిక్ ఇష్యూ దేశ స్టాక్ మార్కెట్ల చరిత్రలోనే అతిపెద్దది కానుండటం గమనార్హం. ప్రస్తుతం ఎల్ఐసీ పేరిట ఉన్న భారీ ఐపీవో రికార్డూ చెరిగిపోనున్నది. అయితే వచ్చే నెల రాబోయే కేంద్ర బడ్జెట్.. ఐపీవోల దూకుడుకు కాస్త బ్రేకులు వేయవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కాగా, ఈ ఏడాదిలో ఇప్పటిదాకా సెన్సెక్స్ 6.8 శాతం, నిఫ్టీ 8.1 శాతం పుంజుకున్నాయి. ఇక 20 శాతానికిపైగా నిఫ్టీ మిడ్‌క్యాప్ 100, 20.5 శాతం మేర స్మాల్‌క్యాప్ 100 పెరిగాయి. స్టాక్ మార్కెట్లలో కొత్తగా లిస్టింగైన కంపెనీలూ.. మదుపరులకు ఆకర్షణీయ రాబడులనే అందిస్తున్నాయి. బీఎస్ఈ ఐపీవో సూచీ ఈ ఏడాది 21.8 శాతం ఎగబాకింది. నిధుల సమీకరణలో ఆర్థిక రంగ సంస్థలదే నాల్గో వంతు (రూ.7,879 కోట్లు) వాటాగా ఉన్నది.

*దేశీయ సంస్థలు, కుటుంబ వ్యాపారస్తులు, అపర కుబేరుల (హెచ్ఎన్ఐ) వద్ద కావాల్సినంత నగదు నిల్వలున్నాయి. దీంతో పబ్లిక్ ఇష్యూలకు విశేష ఆదరణ లభిస్తున్నది. దీన్నిచూసి మరిన్ని సంస్థలు ఐపీవోలకు క్యూ కడుతున్నాయి. ఈ ఏడాది ఇలాగే సాగితే సరికొత్త రికార్డులు ఖాయం.*

**- చిరాగ్ నేగంది, జేఎం ఫైనాన్షియల్ ఎండీ**

- చివరిసారిగా లోక్‌సభ ఎన్నికలు జరిగిన 2019 ప్రథమార్ధంలో 8 ఐపీవోలే వచ్చాయి. వాటి విలువ రూ.5,509 కోట్లు.
- 2014 జనవరి-జూన్‌లో ఒక్క ఇనీషియల్ పబ్లిక్ ఆఫరే వచ్చింది.
- 2009 తొలి అర్ధ భాగంలో రెండు ఐపీవోలు రాగా, వీటి విలువ రూ.302 కోట్లు.
- భారతీయ స్టాక్ మార్కెట్లలోకి ఈ ఏడాదిలో ఇప్పటిదాకా మ్యూచువల్ ఫండ్స్ ద్వారా వచ్చిన నిధులు రూ.1.85 లక్షల కోట్లపైనే.
- విదేశీ మదుపరులు వెనక్కి తగ్గారేమోగానీ.. దేశీయ మదుపరులు మాత్రం సై.
- ఈ జనవరి-జూన్‌లో వచ్చిన భారీ ఐపీవో భారతీ హెక్సాకామ్. దీని విలువ రూ.4,275 కోట్లు. ఆ తర్వాత ఆధార్ హౌజింగ్ ఫైనాన్స్ (రూ.3,000 కోట్లు).
- ఈ ఏడాది వచ్చిన అతిచిన్న ఐపీవో విభోర్ స్టీల్ ట్యూబ్స్. విలువ రూ.72 కోట్లు.
- నిరుడు ప్రథమార్ధంలో సగటు డీల్ పరిమాణం రూ.896 కోట్లు. ఈసారి రూ.859 కోట్లు.

### హీరో బైకులు ప్రియం

న్యూఢిల్లీ, జూన్ 24: ప్రముఖ ద్విచక్ర వాహన సంస్థ హీరో మోటో కార్ప్ వాహన కొనుగోలుదారులకు షాకిచ్చింది. వచ్చే నెల 1 నుంచి అములులోకి వచ్చేలా ఎంపిక చేసిన మాడళ్ల ధరలను రూ.1,500 వరకు పెంచుతూ సోమవారం నిర్ణయం తీసుకున్నది. ఉత్పత్తి వ్యయం పెరగడం వల్లనే కొన్ని మాడళ్ల ధరలను పెంచాల్సి వచ్చిందని కంపెనీ వర్గాలు వెల్లడించాయి.

### తగ్గిన పసిడి రిజర్వులు

న్యూఢిల్లీ, జూన్ 24: విదేశాల్లో రిజర్వు బ్యాంక్ వద్ద ఉన్న బంగారం నిల్వలు తగ్గుముఖం పట్టాయి. మార్చి 2024 నాటికి గోల్డ్ రిజర్వులు 47 శాతం వరకు తగ్గాయి. 2017 తర్వాత ఇదే కనిష్ఠ స్థాయి కావడం విశేషం. విదేశాల్లో ఉన్న బంగారం నిల్వలను దేశానికి తరలిస్తుండటం ఇందుకు కారణం. దేశవ్యాప్తంగా బంగారం రిజర్వులు సెప్టెంబర్ 2021లో 39 శాతంగా ఉండగా, మార్చి 2024 నాటికి ఇవి 53 శాతానికి ఎగబాకాయి. ప్రస్తుతం ఆర్బీఐ వద్ద 822.1 టన్నుల బంగారం ఉంది.

# పన్ను రిబేటు పెంచాలి

- ఉద్యోగుల కోసం ట్రేడ్ యూనియన్ల డిమాండ్
- పాత పెన్షన్ పథకాన్నే అమలు చేయాలి
- కేంద్ర ఆర్థిక మంత్రితో ముందస్తు బడ్జెట్ చర్చలు




న్యూఢిల్లీ, జూన్ 24: వేతన జీవుల కోసం పన్ను రిబేటును పెంచాలని ట్రేడ్ యూనియన్లు కోరుతున్నాయి. ముందస్తు బడ్జెట్ సమావేశాల్లో భాగంగా సోమవారం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో వివిధ వాణిజ్య, వర్తక సంఘాల నాయకులు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు తమ జీతం, గ్రాట్యుటీలపై ఇప్పుడున్న ఆదాయ పన్ను (ఐటీ) రిబేటు సీలింగ్ పరిమితిని భారీగా పెంచాలన్నారు. అలాగే 8వ వేతన సంఘాన్ని ఏర్పాటు చేయాలని, కొత్త పెన్షన్ స్కీం (ఎన్‌పీఎస్)ను రద్దుచేసి.. పాత పెన్షన్ పథకాన్ని (ఓపీఎస్) పునరుద్ధరించాలన్న తదితర డిమాండ్లనూ మంత్రి వద్ద వినిపించారు. వచ్చే నెల పార్లమెంట్‌లో నిర్మలా సీతారామన్ ఈ ఆర్థిక సంవత్సరానికి (2024-25)గాను పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టబోతున్నారన్నది తెలిసిందే.

**ప్రైవేటీకరణ వద్దు**

ప్రభుత్వ రంగ సంస్థ (పీఎస్‌యూ)ల ప్రైవేటీకరణను కేంద్రం ఆపాలని కూడా ఈ సందర్భంగా ట్రేడ్ యూనియన్లు విజ్ఞప్తి చేశాయి. ఏటా పెద్ద ఎత్తున పీఎస్‌యూల్లో వాటాలను ఉపసంహరిస్తున్న మోదీ సర్కారు.. అందుకోసం లక్ష్యాలను పెట్టుకొనిమరీ ముందుకెళ్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఎయిర్ ఇండియా వంటి సంస్థలను ప్రైవేట్ సంస్థలకు అమ్మేసిన సంగతీ విదితమే. కాగా, అసంఘటిత రంగ కార్మికులు, వ్యవసాయ కూలీల కోసం ఓ సామాజిక భద్రతా నిధిని ప్రభుత్వమే ఏర్పాటు చేయాలని, నెలనెలా కనీసం రూ.9,000 పెన్షన్‌తోపాటు ఇతరత్రా వైద్య, విద్య ప్రయోజనాలను దానిద్వారా అందించాలని కూడా తమ మెమరాండంలో మంత్రికి యూనియన్లు సూచించాయి.

### ఈవీలపై జీఎస్టీ హేతుబద్ధం చేయాలి

విద్యుత్తు ఆధారిత వాహనాల (ఈవీ)పై జీఎస్టీ రేట్లను హేతుబద్ధీకరించాలని ఆటో కంపోనెంట్స్ ఇండస్ట్రీ సంఘం (ఏసీఎంఏ) కేంద్ర ఆర్థిక, భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖలకు సమర్పించిన సిఫార్సుల్లో కోరింది. అలాగే పెట్టుబడులకు ప్రోత్సాహకాలు కల్పించాలని, ప్లాంట్-మెషినరీలపై డిప్రిషియేషన్ రేట్ల 15 నుంచి 25 శాతానికి పెంచాలని సూచించింది. ఐటీ చట్టంలోని సెక్షన్ 194ఆర్ కింద వ్యాపార ప్రయోజనాలపై పన్ను కోతలపైనా ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేసింది. కస్టమ్స్ చట్టాల కింద వారసత్వ వివాదాల పరిష్కారార్థం ఆమ్నెస్టీ స్కీంను తేవాలని ఏసీఎంఏ అధ్యక్షుడు శ్రద్ధా సూరీ మార్వా అన్నారు.

### నేటి నుంచి స్పెక్ట్రం వేలం



న్యూఢిల్లీ, జూన్ 24: స్పెక్ట్రం వేలానికి మళ్లీ వేళాయింది. రూ.96 వేల కోట్ల విలువైన వాయుతరంగాలను మంగళవారం నుంచి విక్రయించనున్నారు. 5జీ మొబైల్ సర్వీసులు అందించడానికి సిద్ధమవుతున్న టెలికం దిగ్గజాలైన రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియాలు ఈ వేలంలో పాల్గొనబోతున్నాయి. అంతకుముందు ఆగస్టు 2022లో స్పెక్ట్రాని వేలం వేసిన కేంద్ర సర్కార్..ఈసారి తొలిసారిగా 5జీ సేవల కోసం తరంగాలను వేలం వేస్తున్నది. ఎనిమిది స్పెక్ట్రం బాండ్ విడ్త్ కింద వాయుతరంగాలను వేలం వేస్తే రూ.96 వేల కోట్లకు పైగా నిధులు సమకూరవచ్చునని అంచనా. ఈసారి 800 మెగాహెర్ట్జ్, 900 మెగాహెర్ట్జ్, 1,800 మెగాహెర్ట్జ్, 2,100 మెగాహెర్ట్జ్, 2,300 మెగాహెర్ట్జ్, 2,500 మెగాహెర్ట్జ్, 3,300 మెగాహెర్ట్జ్, 26 గిగాహెర్ట్జ్ వంటి తరంగాలను ఈసారి వేలానికి పెట్టారు.